తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం సభ్యులతో లక్ష్మీనర్సింహారెడ్డి, ఆటా ప్రతినిధులు

బడుల అభివృద్ధికి సహకరించాలి

సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్, జూన్ 10 : అమెరికాలో నివాస ముంటున్న తెలంగాణ రాష్ట్రానికి చెందిన ప్రవాస భారతీయులు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సహకరించాలని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి కోరారు. అమెరికాలోని జార్జియా, అట్లాంటా నగరం వేదికగా నిర్వహిస్తున్న ఆటా మహాసభల్లో భాగంగా, చివరి రోజు తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి అధ్యక్షతన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో తెలంగాణలో విద్య, వైద్యం, నీటి పారుదల తదితర అంశాలపై చర్చించినట్లు లక్ష్మీనర్సింహారెడ్డి తెలిపారు. తెలంగాణలో విద్యారంగంలో అమలవుతున్న పథకాలు సత్ఫలితాలు సాధించే విషయంలో ఎన్‌ఆర్‌ఐల భాగస్వామ్యంపై చర్చించామన్నారు.ఈ సందర్భంగా లక్ష్మీనర్సింహారెడ్డి మాట్లాడుతూ సొంత గ్రామాల్లోని పాఠశాలల అభివృద్ధికి ఎన్‌ఆర్‌ఐలు చేయూతనందించడంతోపాటు దత్తత తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీఎఫ్ ఫౌండర్ మధురెడ్డి, కిశోర్ గూడూరు, భరత్ రెడ్డి, ప్రీతి, నర్సింహారెడ్డి, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి

- సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, ఇతర అధికారులు

రంగారెడ్డి, జూన్ 10 (నమస్తే తెలంగాణ): వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండి.. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, శిశు, సంక్షేమ శాఖల మంత్రి సీతక్క అన్నారు. సోమవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు, సంబంధిత అధికారులతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీజనల్ వ్యాధులపై వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..వర్షాకాలం ప్రారంభమైనందున వర్షాలు, వరదలతో నష్టం కలుగకుండా ముందస్తుగా శిథిలమైన, కూలిపోయేస్థితిలో ఉన్న ఇండ్ల ను గుర్తించి వెంటనే కూల్చివేయాలన్నారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించి వరదల తాకిడికి నివాస గృహాలు మునిగిపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వాతావరణంలో వచ్చిన మార్పులతో సీజన్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున తాగు నీరు కలుషితం కాకుండా చూసుకోవాలని, లీకేజీలను గుర్తించి మరమ్మతులు చేయాలన్నారు. మంచినీటి ట్యాంకులను బ్లీచింగ్ పౌడర్ ద్వారా శుభ్రపర్చాలని, పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించి చెత్త కుప్పలు, మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారిణి శ్రీలత, డీపీవో సురేశ్‌మోహన్, మిషన్ భగీరథ అధికారులు, ఆర్‌డబ్ల్యూ ఎస్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ లేని బస్సులపై కఠిన చర్యలు

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ చంద్రశేఖర్‌గౌడ్

రంగారెడ్డి, జూన్ 10 (నమస్తే తెలంగాణ): పాఠశాలలు జూన్ 12 నుంచి పునఃప్రారంభమవుతున్న నేపథ్యంలో విద్యార్థులను తరలించే బస్సులు తప్పనిసరిగా ఫిట్‌నెస్ కలిగి ఉండాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ చంద్రశేఖర్‌గౌడ్ తెలిపారు. ఉమ్మడి రంగారెడ్డిలో 11,922 విద్యాసంస్థల బస్సులు ఉంటే ఇప్పటివరకు 8,917 బస్సులు మాత్రమే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాయని, మిగిలిన బస్సులు కూడా సంబంధిత రవాణా శాఖ కార్యాలయాల్లో ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌ను పొందాలన్నారు. 15 ఏండ్లు దాటిన విద్యాసంస్థల బస్సులు రోడ్లపై తిరగొద్దని.. వాటిలో విద్యార్థులను తరలిస్తే సీజ్ చేయడమే కాకుండా యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. బస్సులను మంచి కండిషన్‌లో ఉంచడంతోపాటు అనుభవజ్ఞులైన 60 ఏండ్లకు మించని డ్రైవర్లను నియమించుకోవాలని సూచించారు. ఇప్పటివరకు రంగారెడ్డి జిల్లాలో 5,725 బస్సులకు 4,363 బస్సులు, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 5,985 బస్సులకు 4,468, వికారాబాద్ జిల్లాలో 212 బస్సులకు 86 బస్సులు ఫిట్‌నెట్ కలిగి ఉన్నాయని, మిగిలిన బస్సులూ ఫిట్‌నెస్ చేసుకోవాలన్నారు. త్వరలో విద్యాసంస్థల యాజమాన్యాలు, డ్రైవర్లతో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.

రేపు ఉద్యోగ మేళా

షాబాద్, జూన్ 10 : రంగారెడ్డి జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు ఈ నెల 12న ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన కార్యాలయ అధికారిణి జయశ్రీ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 2:30 గంటల వరకు నేషనల్ స్కిల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ క్యాంపస్, శివం రోడ్, ఆపోజిట్ శివం టెంపుల్, విద్యానగర్, హైదరాబాద్‌లో ఉద్యోగమేళా ఉంటుందన్నారు. హైదరాబాద్‌లో Retail, E-Commerce, IT, BPO, Health Sector రంగాల్లో 10th, Intermediate, Degree, ITI, Diploma, BTech, ANM, GNM, B.Sc. Nursing పూర్తి చేసిన వారు అర్హులన్నారు. వయస్సు 18-30 లోపు ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు 9063099306/ 8977175394 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఫారెస్ట్ అధికారులకు జింక అప్పగింత

బొంరాస్‌పేట/కొడంగల్, జూన్ 10 : మండలంలోని పాలబాయితండాలో సోమవారం ఉదయం కుక్కలు జింకను వెంబడిస్తుండగా గమనించిన తండావాసులు దానిని కుక్కల బారి నుంచి కాపాడి ఫారెస్ట్ అధికారులకు అప్పగించారు. గాయపడ్డ జింకను ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు సూర్యానాయక్ తన వాహనంలో కొడంగల్ పశువుల దవాఖానకు తీసుకెళ్లి చికిత్స అనంతరం అటవీశాఖ అధికారులకు అప్పగించారు. కార్యక్రమంలో అరుణ్‌నాయక్, రాజూనాయక్, శ్రీనూనాయక్, చందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గోవుల అక్రమ రవాణాను అరికట్టాలి

కలెక్టరేట్ ఎదుట దేశీ గోవంశ రక్షణ సంవర్ధన సమితి ఆధ్వర్యంలో నిరసన

రంగారెడ్డి, జూన్ 10 (నమస్తే తెలంగాణ) : గోవుల అక్రమ రవాణాను అరికట్టాలని దేశీ గోవంశ రక్షణ సంవర్ధన సమితి ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. గోసంతతిని అక్రమంగా కబేళాలకు తరలించి వధిస్తున్నారని ఈ సందర్భంగా సమితి సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. గోసంతతి సంరక్షణకు చేసిన చట్టాలను అమలు చేయడంలో వివిధ శాఖలు నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. నిరసనలో సమితి సభ్యులు పురుషోత్తంరెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పునాస సాహిత్య సంచిక ఆవిష్కరణ

రవీంద్రభారతి, జూన్ 10: భారత పూర్వ ప్రధాని ప్రముఖ సాహితీవేత్త అయిన పీవీ నరసింహారావుకు భారతరత్న పురస్కారం ఇచ్చిన సందర్భంగా, తెలంగాణ సాహిత్య అకాడమీ వారు పీవీ నరసింహారావు సాహిత్యంపై ప్రత్యేకంగా వెలువరించిన 'పునాస' ఏప్రిల్ – జూన్ 2024 సాహిత్య సంచికను సోమవారం రవీంద్రభారతిలోని సాహిత్య అకాడమీలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బుర్రా వెంకటేశం మాట్లాడుతూ, పునాస సాహిత్య సంచిక చాలా అద్భుతమైనదని కొనియాడారు. కార్యక్రమంలో సాహిత్య అకాడమీ కార్యదర్శి డా.ఎన్.బాలాచారి, రాపోలు సుదర్శన్ పాల్గొన్నారు.

వివిధ కోర్సుల పరీక్షా ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 10: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ పరీక్షల విభాగం, కంట్రోలర్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. బీపీఈడీ, డీపీఈడీ మొదటి, మూడో సెమిస్టర్ రెగ్యులర్, ఎంఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్, బ్యాచ్‌లర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ, పీజీడీసీయూఎల్ కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదల చేశామని చెప్పారు.

అకౌంటెంట్ ఉద్యోగానికి దరఖాస్తులు ఆహ్వానం

దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా సభ వొకేషనల్ కోర్స్ సెంటర్‌లో అకౌంటెంట్ ఉద్యోగానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సెంటర్ ద్వారా యువతకు వివిధ వృత్తి విద్యలో డిప్లమా, సర్టిఫికెట్ కోర్సులను అందిస్తున్నట్లు చెప్పారు. ఏదైనా డిగ్రీ చదివి, ట్యాలీపై అవగాహన ఉన్నవారు ఈ ఉద్యోగానికి అర్హులని పేర్కొన్నారు. రూ.12,000 ప్రారంభ వేతనంతో ఉద్యోగంలో చేరేందుకు ఆసక్తి ఉన్న వారు విద్యానగర్‌లోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఆస్పత్రి ప్రాంగణంలోని తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ నం. 83090 37134లో సంప్రదించవచ్చని చెప్పారు.

ఎంఏ లాంగ్వేజెస్ చాలెంజ్ వాల్యూయేషన్‌కు..

ఓయూ పరిధిలోని ఎంఏ లాంగ్వేజెస్ కోర్సుల పరీక్షా ఫలితాలపై ఛాలెంజ్ వాల్యూయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఎంఏ లాంగ్వేజెస్ మొదటి, మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. ఈ ఫలితాలపై అనుమానం ఉన్నవారు ఒక్కో పేపర్‌కు రూ.10,000 చొప్పున చెల్లించి, ఈ నెల 20వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జవాబు పత్రాల నకలు పొందగోరేందుకు ఒక్కో పేపర్‌కు రూ.1,000 చొప్పున చెల్లించి ఈ నెల 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అంతర్జాతీయ ప్రతిభాపురస్కారాలకు..

సిటీబ్యూరో, జూన్ 10(నమస్తే తెలంగాణ): మలేషియా అంతర్జాతీయ ప్రతిభా పురస్కారాలకు ఈ నెల 20లోగా దరఖాస్తు చేసుకోవాలని ఫెడరేషన్ ఆఫ్ ఎన్నారై కల్చరల్ అసోసియేషన్ మలేషియా శాఖ వెల్లడించింది. అందుకోసం అర్హులైన అభ్యర్థుల నుంచి నిర్వాహకులు దరఖాస్తులు కోరుతున్నారు. హైదరాబాద్‌లోని ఫెడరేషన్ బ్రాంచ్ కార్యాలయంలో సంస్థ వ్యవస్థాపక అంతర్జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మిరియాల జానకిరామ వరప్రసాద్ తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రతిభ పురస్కారాలపై వివరాలు తెలిపారు. విద్యా, వైద్యం, వైజ్ఞానిక, విజ్ఞాన సామాజిక, సాంస్కృతిక, సాహిత్య, సాహితీ, సేవా, సినీ, క్రీడా రంగాల్లో నిష్ణాతులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తి కలిగిన వారు జూన్ 20లోగా దరఖాస్తు చేసుకోవాలని, జూన్ 26న అంతర్జాతీయ ప్రతిభ పురస్కారాలను కౌలలంపూర్, మలేషియాలో అందజేయనున్నట్లుగా తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ నం. 96669 10480లో సంప్రదించాలన్నారు.

పసిపిల్లలను విక్రయించే సూత్రధారులెక్కడ..?

రెండు రాష్ట్రాల పోలీసుల గాలింపు
అయినా.. ముందుకు సాగని దర్యాప్తు
హోంలోని పిల్లలు.. తల్లిదండ్రుల చెంతకు చేరేనా..?

సిటీబ్యూరో, జూన్ 10 (నమస్తే తెలంగాణ): పసిపిల్లల విక్రయాల కేసులో అసలు సూత్రధారులెవరు..? అనే విషయాన్ని ఇప్పటికీ రాచకొండ పోలీసులు గుర్తించలేదు. ఢిల్లీ, పుణెలోని ప్రధాన ఏజెంట్ల ఆచూకీ తెలిస్తేనే.. హోంలో ఉన్న పిల్లల అసలు తల్లిదండ్రులను గుర్తించే అవకాశం ఉంది. చిన్న పిల్లలను విక్రయిస్తున్న ముఠా వ్యవహారాన్ని గత నెలలో ఒక స్వచ్ఛంద సంస్థ చొరవతో పోలీసులు గుర్తించి, 11 మందిని అరెస్టు చేసి, 14 మంది పసి పిల్లలను కాపాడిన విషయం తెలిసిందే. ఇక్కడ పట్టుబడ్డ ముఠా మాదిరిగానే ముంబై ఠానే పోలీసులు కూడా ఎనిమిది మంది సభ్యులున్న ఏజెంట్ల ముఠాను అరెస్టు చేసి, మూడు నెలల పసి పాపను కాపాడారు. అక్కడ పోలీసులు డెకాయ్ ఆపరేషన్ నిర్వహించి ఈ ముఠా వ్యవహారాన్ని బయటకు తెచ్చారు. ఈ రెండు ముఠాలకు సంబంధించిన సమాచారాన్ని తెలంగాణ, మహారాష్ట్ర పోలీసులు ఒకరికొకరు షేర్ చేసుకున్నారు. అయితే, మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్న కీలకమైన ముఠా ఆచూకీ మాత్రం ఇప్పటికీ గుర్తించలేదు. మేడిపల్లి పోలీసులకు పట్టుబడ్డ ముఠా 60 మంది పసిపిల్లలను విక్రయించినట్లు పోలీసులు గుర్తించారు. ఠానే పోలీసులు అరెస్టు చేసిన ముఠా మరెంత మందిని విక్రయించిందనే విషయంలో స్పష్టత రావాల్సి ఉంది. ముఠా నుంచి పోలీసులు కాపాడిన పసిపిల్లలు శిశువిహార్‌లో ఉన్నారు. అయితే, ముంబై, పుణెతోపాటు ఢిల్లీ మూలాలున్న కీలక నిందితులను పట్టుకుంటే.. ఎక్కడి నుంచి ఎంత మంది పిల్లలను తెచ్చారనే విషయంలో స్పష్టత వస్తుంది. ఏజెంట్లను అరెస్టు చేసి 15 రోజులు అయ్యింది. మిగతా నెట్‌వర్క్‌ను గుర్తించడంలో దర్యాప్తు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్న చందంగా ఉంది. పోలీసులకు పట్టుబడ్డ ఏజెంట్లకు, పిల్లలను విక్రయించిన మరో ముగ్గురు ఏజెంట్ల ముఠా ఆచూకీ తెలిసినప్పుడే.. ఈ కేసు వేగంగా ముందుకు వెళ్లేందుకు అవకాశాలున్నాయి.

ఢిల్లీకి చెందిన కిరణ్, ప్రీతి, పుణెకు చెందిన కన్నయ్య పట్టుబడితేనే పిల్లల అసలు తల్లిదండ్రులెవరు..! ఎక్కడి నుంచి పిల్లలను కొట్టుకొచ్చారు..! అనే విషయం తెలుస్తుంది. స్థానికంగా ఉన్న ఏజెంట్లు పోలీసులకు పట్టుబడటంతో ఢిల్లీ, పుణెలో ఉన్న ముగ్గురు ఏజెంట్లు అజ్ఞాతంలోకి వెళ్లారు. ఇప్పటికీ మేడిపల్లి పోలీసులు వీరి కోసం గాలించినా ఫలితం లేకుండా పోయింది. మహారాష్ట్ర పోలీసులు సైతం ఈ ముఠా కోసం వెతుకుతున్నారు. అయినా, కీలక నిందితులు తప్పించుకుంటున్నారు.

తల్లిదండ్రులను గుర్తించాలంటే..!

పసిపిల్లలను విక్రయిస్తున్న ముఠాకు సంబంధించిన మూలాల వరకు వెళ్లి.. వారి తల్లిదండ్రులను పోలీసులు గుర్తించాలి. అయితే, ఇక్కడ కొందరు తమ పిల్లలను స్వచ్ఛందంగానే డబ్బు కోసం ముఠాలకు విక్రయించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. దీంతో ఎక్కడ కూడా పసిపల్లల కిడ్నాప్, అదృశ్యానికి సంబంధించిన కేసులు నమోదు కాలేదు. స్వచ్ఛందంగా పిల్లలును విక్రయించిన వారు ఇప్పుడు తమ చిరునామాలను కూడా మార్చే అవకాశం ఉంది. మేడిపల్లి పోలీసులు అరెస్టు చేసిన ఏజెంట్ల ముఠా విక్రయించిన మరో 46 మంది పసిపిల్లల ఆచూకీని గుర్తించాల్సి ఉంది. అదే విధంగా వారికి జన్మనిచ్చిన తల్లిదండ్రులను కూడా గుర్తించాల్సి ఉంది. ఈ కేసును ఇప్పుడు రాచకొండ పోలీసులు చివర వరకు తీసికెళ్తారా..? ఇక్కడే వదిలేస్తారా..? అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. ప్రస్తుతం అధికారుల బదిలీలు ఉండవచ్చన్న చర్చ జరుగుతోంది. దీంతో కింది స్థాయిలో ఉండే అధికారులు సైతం వేచి చూసే ధోరణితో ఉన్నారు. ఈ కేసు ప్రాధాన్యత రోజు రోజుకు తగ్గుతుందనే వాదన సైతం వినిపిస్తోంది. శిశువిహార్‌లో ఉన్న 14 మంది పిల్లలు ఆరోగ్యంగానే ఉన్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. వారి అసలు తల్లిదండ్రులను గుర్తించే పనిలో పోలీసులు ఉన్నారని వారు చెబుతున్నారు. ఇటీవల పసిపిల్లలను పోలీసులు రిస్క్యూ చేసి, వారిని శిశువిహార్‌కు తరలించిన విషయం తెలిసిందే. తమ పిల్లలను తీసుకెళ్లొద్దంటూ పెంచిన తల్లులు వేడుకున్నారు. ఆ తరువాత కొందరు హోం వద్దకు కూడా వచ్చి తమ పిల్లలను తమకివ్వాలంటూ ప్రాధేయపడ్డారు. నిబంధనల ప్రకారమే దత్తత తీసుకోవాలని, అందుకు దరఖాస్తు చేసుకోవచ్చంటూ అధికారులు సూచిస్తూ.. వారికి కౌన్సెలింగ్ కూడా ఇస్తున్నారు.

జర్నలిస్టు పిల్లల స్కూల్ ఫీజులో రాయితీ

ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా విద్యాశాఖ

సిటీబ్యూరో, జూన్ 10(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల్లో 2024-25వ విద్యా సంవత్సరానికిగాను జర్నలిస్టు పిల్లలకు ఫీజు రాయితీ ఇస్తూ జిల్లా విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్‌లోని ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల భారం మోయలేనంతగా ఉందని, జర్నలిస్టుల పిల్లలకు రాయితీ ఇవ్వాలని హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్(హెచ్‌యూజే) జిల్లా అధ్యక్షుడు శివశంకర్, కార్యదర్శి ఖాజా అబ్దుల్ హమీద్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకుడు రాజేశ్ నేతృత్వంలోని ప్రతినిధుల బృందం చేసిన విన్నపానికి జిల్లా విద్యా శాఖ స్పందించింది. ఈ మేరకు ఫీజుల్లో రాయితీ కల్పించాలని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు ఆదేశాలు జారీ చేసింది. దీనికి సంబంధించిన సర్క్యూలర్ పత్రాన్ని హైదరాబాద్ జిల్లా విద్యా శాఖ అధికారి రోహిణీ హెచ్‌యూజే ప్రతినిధులకు అందజేశారు.

ట్రేడింగ్ పేరుతో రూ.41 లక్షలు గోవిందా..!

సిటీబ్యూరో, జూన్ 10 (నమస్తే తెలంగాణ): ఫేస్‌బుక్‌లో పరిచయమైన వ్యక్తి ఇచ్చిన ట్రేడింగ్ సలహాతో హైదరాబాద్‌కు చెందిన ఓ వైద్యుడు సైబర్‌నేరగాళ్ల చేతికి చిక్కి రూ. 41.28 లక్షలు పోగొట్టుకున్నాడు. వివరాలిలా ఉన్నాయి.. హైదరాబాద్‌కు చెందిన ఓ వైద్యుడికి ఫేస్‌బుక్‌లో గుర్తు తెలియని వ్యక్తి పరిచయమై ట్రే డింగ్ గురించి వివరించాడు. అతడి మాటలు నమ్మిన వైద్యుడు.. కైయిన్‌మార్కెట్.విన్ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని, అందులోకి లాగిన్ అయ్యాడు. అందులోనే కొంత ఇన్వెస్ట్ చేస్తూ, లాభాల్లో నుంచి విత్‌డ్రా చేశాడు. ఇన్వెస్ట్‌మెంట్ పెరుగగానే ఆ వెబ్‌సైట్ నుంచి విత్‌డ్రా చేసుకునే అవకాశాన్ని తొలగించారు. ఇది మోసమని గుర్తించి.. అదే ఫేస్‌బుక్‌లో సమస్య పరిష్కారానికి ఆలోచిస్తుండగా.. మరో వ్యక్తి ఆన్‌లైన్‌లోకి వచ్చాడు. అలా కాదు.. మీరు ఇంకో వ్యాలెట్‌లో డిపాజిట్ చేయాలంటూ నమ్మించాడు. అయితే, దీనిపై అనుమానం వచ్చి ఇన్వెస్ట్ చేయలేదు. మీకు అనుమానం ఉండవచ్చు.. అయితే, మీరు ఇప్పటివరకు పెట్టిన ఇన్వెస్ట్‌మెంట్ అంతా క్రిప్టోలోకి మార్చుకుంటూ మరో సైట్ అడ్రస్ ఇచ్చి, బాధితుడితో క్రిప్టోకి మార్చించి వాటిని కొట్టేశారు. బాధితుడి నుంచి పలు విడుతలుగా సైబర్‌నేరగాళ్లు రూ. 41.28 లక్షలు కాజేశారు. సోషల్‌మీడియాలో పరిచయమైన గుర్తు తెలియని వ్యక్తుల చేతిలో చిక్కి ఓ వైద్యుడు రూ.41.28 లక్షలు పోగొట్టుకున్నాడని, సోషల్‌మీడియాలో వచ్చే ప్రకటనలు, కొత్తవారు చెప్పే మాటలను నమ్మవద్దని సైబర్‌క్రైమ్ పోలీసులు సూచిస్తున్నారు.

హత్యకేసులో ముగ్గురికి జీవితఖైదు

రూ.25,500 చొప్పున జరిమానా విధింపు
భార్య ముందు కొట్టినందుకు కక్షతో హత్య

నాంపల్లి కోర్టులు, జూన్ 10 (నమస్తే తెలంగాణ): బహదూర్‌పురా పోలీసుస్టేషన్ పరిధిలో జరిగిన మన్సూర్‌ఖాన్ హత్య కేసులోని నిందితులకు షేక్‌ఖాలీద్ (40), మహ్మద్‌అన్వర్ అలియాస్ అన్నూ (35), మహ్మద్ మునావర్ అలియాస్ బబ్బూ(30)కు జీవిత ఖైదు విధిస్తూ మెట్రోపాలిటన్ సెషన్ జడ్జి సురేశ్ సోమవారం తీర్పు వెల్లడించారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.శైలజ కథనం ప్రకారం.. ఈ కేసు విచారణలో సాక్షులు తెలిపిన వాంగ్మూలాల ఆధారంగా ముగ్గురు నిందితులు నేరం చేసినట్లు రుజువు కావడంతో జీవిత ఖైదుగా శిక్షను కోర్టు ఖరారు చేసిందని తెలిపారు. రూ.25,500 చొప్పున ముగ్గురికి జరిమానా విధించిందని, జరిమానా చెల్లించని పక్షంలో మరో ఆరు నెలల జైలు శిక్షను అనుభవించాలని కోర్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. విచారణ అధికారిగా హరీశ్‌కౌషిక్ సాక్షుల వాంగ్మూలాలను, సాక్ష్యాధారాలను సేకరించి చార్జిషీట్‌ను కోర్టుకు సమర్పించారని తెలిపారు. ఈ కేసుకు సహకరించిన ఎస్.మహేందర్, మాహెద్‌ఖాన్‌ను బహదూర్‌పురా ఎస్‌హెచ్‌ఓ బి.రఘునాథ్ అభినందించారు.

పగతోనే హత్య..

ప్రధాన నిందితుడు షేక్ ఖాలీద్ అధికంగా మద్యం తాగి, తరచూ గొడవలకు దిగేవాడని, మద్యం తాగొద్దని, ముస్లిం ఆచారానికి వ్యతిరేకమని మన్సూర్‌ఖాన్ (హత్యకు గురైన వ్యక్తి) నచ్చజెప్పినా వినకుండా నిందితుడు తాగిన మైకంలో ఇతరులపై దాడులకు పాల్పడ్డాడని పోలీసులు తెలిపారు. ఇంట్లో తన సోదరుడితో జరిగిన చిన్న తగాదాకు కూడా మన్సూర్‌ఖాన్ పెద్ద మనిషిగా వచ్చి హెచ్చరించాడని, దీంతో ప్రధాన నిందితుడు మరింత కక్షను పెంచుకున్నాడు. మన్సూర్ ఎదురు పడిన ప్రతిసారీ ప్రధాన నిందితుడు తిట్టడం మొదలుపెట్టాడు.

ఈ క్రమంలో మన్సూర్ కూడా తిరిగి తిట్టడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ గొడవలో ప్రధాన నిందితుడు మన్సూర్‌పై దాడిచేసి చెంపపై కొట్టాడు. దీంతో మన్సూర్‌తోపాటు అతడి అనుచరులు ప్రధాన నిందితుడి ఇంటికి వెళ్లి ఎందుకు కొట్టావంటూ దాడికి దిగారు. ప్రధాన నిందితుడిని అతడి భార్య ముందు కొట్టడంతో తీవ్ర మనస్తాపానికి గురైన మన్సూర్‌పై మరింత పగ పెంచుకున్నాడు.

ఎలాగైనా మన్సూర్‌ను హతమార్చాలని అన్నూ, బబ్బూలతో గొడవ గురించి వివరించాడు. పథకం ప్రకారం హత్య చేయాలను ముగ్గురు కాపు కాశారు. బహదూర్‌పురాలో హెచ్‌కేజీఎన్‌ఆర్ పేరిట నిందితుడు ద్విచక్ర వాహనాల వాటర్ సర్వీసింగ్ సెంటర్ నడుపుతున్నాడు. తన షాపు ముందు నుంచే మన్సూర్ బైక్‌పై వెళ్తున్న సమయంలో ముగ్గురు మాటువేసి ఒక్కసారిగా అతడిపై కత్తులతో దాడిచేసి విచక్షణారహితంగా పొడిచారు. బైక్ పైనుంచి కిందపడటంతో మన్సూర్ తప్పించుకునేందుకు పరుగెత్తే సమయంలో అబ్బూ అతడిని పట్టుకోగా అన్నూ, ఖాలీద్ పీపు, కడుపులో కత్తితో మరోసారి పొడిచారు. అప్పటికీ మరణించలేదనే అనుమానంతో ఖాలీద్ కత్తితో మన్సూర్ గొంతుకోశాడు. మరణించాడని తెలుసుకున్న అనంతరం ముగ్గురు నిందితులు అక్కడి నుంచి బైకులపై పారిపోయారు.

కార్మికుల ప్రాణాలతో ఏజెన్సీల చెలగాటం..!

పీఎఫ్, ఈఎస్‌ఐ కార్డుల అందజేతలో విఫలం
ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలి
ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల యూనియన్ డిమాండ్

సిటీబ్యూరో, జూన్ 10 (నమస్తే తెలంగాణ): జలమండలిలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఈఎస్‌ఐ కార్డులు అందజేయడంలో, పీఎఫ్ చెల్లించడంలో ఘోరంగా విఫలమయ్యారని జలమండలి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నారాయణ విమర్శించారు. ఈ విషయంలో అధికారుల నిర్లక్ష్యంగా ఉన్నారని ఆరోపించారు. డివిజన్ 6 ఎల్లారెడ్డి సెక్షన్‌లో పనిచేసే చంద్రశేఖర్ ఆదివారం జరిగిన ఆటో ప్రమాదంతో కాలు, చేయి విరిగి అపస్మారక స్థితిలో ఉన్నాడని, సుమతి ఏజెన్సీ, ఈఎస్‌ఐ కార్డులు అందజేయడంలో ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్‌ఐ సక్రమంగా చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని నారాయణ తెలిపారు. కార్మికులకు ప్రమాదాలు జరిగినా పట్టించుకోని ఏజెన్సీలు, సుమతి ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని నారాయణ హెచ్చరించారు. చంద్రశేఖర్ వైద్యానికి సహకరిస్తున్న జీఎం హరిశంకర్, డీజీఎం, మేనేజర్‌లకు ఈ సందర్భంగా యూనియన్ నేతలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కిరణ్‌కుమార్, రాజరత్నం, శ్రీనివాస్ రెడ్డి, కుశాల్, మహ్మద్ సమద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

బండ్లగూడ,జూన్ 10: రోడ్డు ప్రమాదం